క్లుప్తంగా

రేపు దంత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: ఎస్‌హెచ్‌ఓ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా ఈనెల 14వ తేదీ ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు సంస్థల అధ్యక్షులు డాక్టర్ తాతా సేవ కుమార్, పావులూరు రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు గుంటూరు 2/1 బ్రాడీపేట లోని ఎస్‌హెచ్‌ఓ భవనంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సహాయం

గుంటూరు మెడికల్: గుంటూరులో యాదవ జూనియర్ కాలేజీలో ఇంటర్ చదువుతున్న విద్యార్థిని తాడిబోయిన భార్గవికి పవన్ జోవిత ఫౌండేషన్ అధ్యక్షుడు సీదా పవన్‌కుమార్ కళాశాల ఫీజులు చెల్లించేందుకు ముందుకు వచ్చారు. భార్గవి తల్లి షాపులో ఉద్యోగం చేస్తూ ఇద్దరు పిల్లలను కష్టపడి చదివిస్తుంది. ఈవిషయం తెలుసుకుని భార్గవికి చదువుకి కు సంబంధించి ఇంటర్ మొదటి సంవత్సరం ఫీజు మొత్తాని ఫౌండేషన్ అధ్యక్షుడు సీదా పవన్ కుమార్ కళాశాల ప్రిన్సిపాల్‌కు అందజేశారు. కార్యక్రమంలో అందే వెంకటేష్, తల్లం శివకుమార్, కొమ్మినేని రవితేజ, మురళీ మోహన్, దిలీప్, అరవింద్ పాల్గొన్నారు.

విధుల్లో చేరిన జీజీహెచ్ ఏడీ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా చిత్తజల్లు నాగేశ్వరరావు శుక్రవారం విధుల్లో చేరారు. గత నవంబరులో ఏడీ నాగేశ్వరరావు ఆరోపణలు రావడంతో అతడిని సరెండర్ చేశారు. విచారణ పూర్తికావడంతో తిరిగి విధుల్లో చేరారు.

వైభవంగా కూడారై

నగరంపాలెం: టీటీడీ ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై శుక్రవారం సాయంత్రం వైభవంగా కూడారై నిర్వహించారు. తిరుప్పావై అమృతవర్షిణి డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగనాయకి విశేషంగా పాల్గొన్న సువాసినులతో కూడారై వెల్లుమ్‌శీర్ గోవిందా 27వ విశేష పాశురం పారాయణం చేపట్టారు. 400 గంగాళాలతో మధురమైన పాయసాన్ని నింపి భక్తులకు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటి అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గుంటూరు ఈస్ట్: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా నగరంలో శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసబాబు శుక్రవారం తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, కొన్ని కాలనీల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చీటీల నిర్వాహకురాలిపై పోలీసులకు ఫిర్యాదు

పట్నంబజారు: లాలాపేట పోలీసు స్టేషన్ పరిధిలో ఓ మహిళ చీటీ పాటలు నిర్వహించి ప్రజలకు సొమ్మును చెల్లించకుండా పరారైన ఘటనపై బాధితులు లాలాపేట పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం మేరకు నల్లచెరువు పరిసర ప్రాంతాల్లో మహిళ చీటీ పాటలు నిర్వహించి సంబంధిత డబ్బులు ఇవ్వకుండా పరారైనట్లు తెలుస్తోంది. సుమారు రూ.30 నుంచి రూ.40 లక్షల మేరకు సొమ్ము బాధితులకు చెల్లించాల్సి ఉందని సమాచారం. అయితే దీనిపై ఫిర్యాదు చేసేందుకు బాధితులు లాలాపేట పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం.

ఎస్సీ వర్గీకరణపై స్పష్టమైన అభిప్రాయాన్ని తెలియజేయాలి

నెహ్రూనగర్: ఎస్సీ వర్గీకరణ అంశం సుప్రీం కోర్టులో ఈ నెల 17వ తేదీన విచారణకు రానున్న నేపథ్యంలో ఈ విషయంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన స్పష్టమైన అభిప్రాయాన్ని తెలియజేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు ముప్పంగి నాగరాజు శనివారం ఓ ప్రకటనలో కోరారు. మాదిగలకు జనాభా నిష్పత్తి ప్రకారం సీట్లు కేటాయింపు చేయాలని కోరుతూ సీఎం వైఎస్ జగన్‌ను కలిసేందుకు తమకు అనుమతి ఇవ్వాలంటూ లేఖ రాసినట్లు వెల్లడించారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

పొన్నూరు: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో శుక్రవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. సంస్థ అధ్యక్షులు తిరుమలశెట్టి ఉమా శంకర్, మల్లెబోయిన నాగరాజు పాల్గొని, శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరం ఉన్నవారికి, తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం ఈ శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. పట్టణానికి చెందిన యువకులు పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం వారికి ప్రశంసా పత్రాలు అందించి, అభినందించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి గుడివాడ పవన్, కె.వి.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ కాట్రగడ్డ విజయ్ కుమార్, పి.భాస్కర్, విష్ణు మొలకల సత్యం, వీరనాల ఆనంద్, తిరుమలశెట్టి మేఘనాథ్ జాహ్నవి, ఆచారి పాల్గొన్నారు.

విద్యార్థులు సానుకూల దృక్పథంతో ముందుకెళ్లాలి


విద్యార్థినికి పుస్తకాన్ని అందజేస్తున్న శివన్నారాయణ, పార్థసారథి

గుంటూరు ఎడ్యుకేషన్: జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు విద్యార్థులు సరైన గమ్యాన్ని నిర్దేశించుకుని సానుకూల దృక్పథంతో ముందుకెళ్లాలని రామకృష్ణ శారద విద్యాలయ ప్రిన్సిపాల్ ప్రవరాజిక బోధమయ ప్రాణ మాతాజీ అన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజనోత్సవం శుక్రవారం నిర్వహించారు. కళాశాల పాలకమండలి కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూదనరావు అధ్యక్షత వహించారు. ప్రాణ మాతాజీ మాట్లాడుతూ విద్యార్థులు స్వామి వివేకానందుని జీవిత విశేషాలను తెలుసుకుని స్ఫూర్తిని పొందాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రవరాజిక కళ్యానాత్మ ప్రాణమాతాజీ మాట్లాడుతూ స్వామి వివేకానంద బాల్యంలో ఎదుర్కొన్న సమస్యలు, రామకృష్ణ పరమహంస పర్యవేక్షణలో చేసిన సమాజ సేవా కార్యక్రమాలను గురించి వివరించారు. హిందూ కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ స్వామి వివేకానంద బోధనలతో స్ఫూర్తి పొందిన డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు ఔషధ రంగంలో చేసిన పరిశోధనలతో టెట్రా సైక్లిన్, ఫోలిక్ యాసిడ్ వంటి ఔషధాలను కనిపెట్టారని తెలిపారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవికుమార్, ఫార్మా.డి డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య పాల్గొన్నారు.

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో..

లక్ష్మీపురం: స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. తొలుత చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడి, విశ్రాంత రాజనీతి శాస్త్రశాఖాధిపతి ఎస్.తిరుపతయ్య మాట్లాడారు. కార్యక్రమంలో విద్యావేత్త ఇ.చంద్రయ్య, ప్రధానోపాధ్యాయులు సింగరయ్య పాల్గొన్నారు.

వివేకానందుని జీవితం స్ఫూర్తిదాయకం


వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్: వివేకానంద జయంతిని పురస్కరించుకొని బీజేపీ గుంటూరు జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో అధ్యక్షురాలు నడ్డి నాగమల్లేశ్వరి అధ్యక్షతన 'నమో రన్' కార్యక్రమం తెలుగు తల్లి విగ్రహం వద్ద నుంచి వివేకానంద విగ్రహం వరకు విద్యార్థులకు పరుగు పోటీలు శుక్రవారం నిర్వహించారు. నాగమల్లేశ్వరి యాదవ్ మాట్లాడుతూ స్వామివికానంద సూక్తులు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్, ఎస్.అరుణ, వి.జయప్రకాష్ నారాయణ, ఈ.శ్రీనివాసరెడ్డి, ఎం. సుధాకర యాదవ్, కుమార్ గౌడ్, పి.రవికుమార్, లక్ష్మి, బి.శ్రీదేవి, కె.శ్రీకళ్యాణి, లక్ష్మీ ప్రసన్న, వాణి వెంకట్ పాల్గొన్నారు.

సంక్షేమ సేవా సమితి ఆధ్వర్యంలో..


మాట్లాడుతున్న ప్రాణమాతాజీ

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు స్వామి వివేకానందుని ఆదర్శంగా తీసుకోవాలని బ్రాహ్మణ ఉద్యోగ, ఉపాధ్యాయ సంక్షేమ సేవా సమితి ఉమ్మడి గుంటూరు జిల్లా శాఖ అధ్యక్షుడు జంగాలపల్లి పార్థసారథి పేర్కొన్నారు. శుక్రవారం మల్లారెడ్డినగర్‌లోని సెంట్రల్ పబ్లిక్ స్కూల్లో సేవా సమితి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజనోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసం, పట్టుదలతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఈసందర్భంగా టెస్ట్ విద్యార్థులకు స్వామి వివేకానంద సూక్తులతో కూడిన పుస్తకాలను బహూకరించారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి శివన్నారాయణ, సభ్యులు వెంకటరమణ, సాంబశివరావు, వేణుగోపాల్, గౌరీనాథ్, గోపరాజు నరసింహారావు, పాఠశాల డైరెక్టర్ రామచంద్రారెడ్డి, మేనేజర్ ఎస్‌కే వలి పాల్గొన్నారు.

మిరాకిల్స్ వరల్డ్ రికార్డ్ గ్రహీతకు ఘనసన్మానం


పురుషోత్తమ ప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

పాత గుంటూరు: ఉపాధ్యాయ వృత్తితోపాటు, కళారంగంపై మక్కువతో పాటలను ఆలపించి ప్రజల నుంచి ప్రశంసలు పొందుతున్న మేకల పురుషోత్తమ ప్రసాద్ అభినందనీయులని విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ రావంశెట్టి నరసింహారావు అన్నారు. అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజ ఆడిటోరియంలో ఘంటసాల ఆలపించిన 129 పాటలు పన్నెండు గంటలపాటు ఏకధాటిగా ఆలపించి మిరాకిల్స్ వరల్డ్ రికార్డు సాధించిన శ్రీశుభాంజలి కళావేదిక వ్యవస్థాపకుడు మేకల పురుషోత్తమ ప్రసాద్ కు సంస్థ సభ్యులు, కళ సంస్థల ప్రతినిధులు సన్మాన సభ శుక్రవారం నిర్వహించారు. డాక్టర్ పట్టాభి కళాపీఠం అధ్యక్షులు తూములూరి రాజేంద్రప్రసాద్ సభకు అధ్యక్షత వహించారు. ప్రముఖ రంగస్థల నటులు కావూరు సత్యనారాయణ, భారతీ కళావేదిక అధ్యక్షులు మిరియాల ప్రసాదరావు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో కళాసాధ అధ్యక్షులు బి.అశోక్ , గుంటూరు జిల్లా కాపునాడు పార్లమెంటరీ అధ్యక్షులు ఎం.గోపీకుమార్, అఖిల భారత పంచాయతీ కార్యదర్శి జాస్తి వీరాంజనేయులు, కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు డైరెక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు, జిల్లా సంగీత కళాకారుల సంఘం అధ్యక్షులు ఎం.వెంకటస్వామి పాల్గొన్నారు. కార్యక్రమానికి ప్రముఖ గాయని వై.హేమమాలిని వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో భాగస్వాములు కండి

ఏఎన్‌యూ వీసీ ఆచార్య రాజశేఖర్

ఏఎన్‌యూ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ మహోన్నత కార్యక్రమంలో మన బాధ్యత నిర్వహిద్దామని యూనివర్సిటీ వర్గాలకు వీసీ ఆచార్య పి.రాజశేఖర్ పిలుపునిచ్చారు. విగ్రహావిష్కరణ సన్నాహక కార్యక్రమాలపై శుక్రవారం యూనివర్సిటీలో వీసీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా విజయవాడలో ఈనెల 19వ తేదీన జరిగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం ఆవిష్కరణ సందర్భంగా ముందస్తుగా రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. వీటిలో భాగంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి అకడమిక్ కార్యక్రమాన్ని ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. ఈనెల 17వ తేదీన 'డాక్టర్ బీఆర్ అంబేడ్కర్– భారత రాజ్యాంగం' అంశంపై విద్యార్థుల ప్రాజెక్టుతో పాటు ఎగ్జిబిషన్ కూడా నిర్వహించాలని వీసీ సూచించారు. ఈ కార్యక్రమానికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నాలెడ్జి పార్టనర్‌గా వ్యవహరిస్తుందని తెలిపారు. విద్యావిషయక అంశాల్లో గెస్ట్ లెక్చర్స్, ఎగ్జిబిషన్, ప్రాజెక్టుల ప్రదర్శన నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను తప్పకుండా పాటించి విజయవంతం చేయాలని ఆదేశించారు. వర్సిటీ పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులు అతిథి అధ్యాపకులు, ఉద్యోగులు తమకు అప్పగించిన బాధ్యతలు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. సమీక్ష సమావేశంలో రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, సీడీసీ డీన్ ఆచార్య కె.మధుబాబు, ప్రిన్సిపాల్స్ ఆచార్య సీహెచ్ స్వరూపరాణి, ఆచార్య పి.జాన్సన్, ఆచార్య సిద్ధయ్య, సీడీఈ డైరెక్టర్ డాక్టర్ బి.నాగరాజు, అంబేడ్కర్ అధ్యయన కేంద్రం అధిపతి ఆచార్య వై.అశోక్ కుమార్, డాక్టర్ కె.అబ్రహం లింకన్, ఇంజినీర్ కుమార్ రాజా పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు


వైద్య పరికరాన్ని డాక్టర్ కిరణ్‌కుమార్‌కు అందజేస్తున్న డాక్టర్ అపర్ణ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌ను చిల్లరకొట్టుగా మారిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆస్పత్రిలోని సంగం డెయిరీ షాపును ఆయన సందర్శించారు. సంగం డెయిరీ ఉత్పత్తులకు సంబంధించిన వ్యాపారం చెయ్యకుండా ఇతర ఉత్పత్తులను విక్రయించడమే కాకుండా అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని నిర్వాహకులను ప్రశ్నించారు. ఆసుపత్రిలో వాతావరణం కలుషితం చేస్తున్నారన్నారు. ప్రభుత్వాన్నికి చెడ్డ పేరు తీసుకు రావద్దన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే వెంటనే నోటీసు ఇవ్వాలని సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్‌ను ఆదేశించారు. సూపరింటెండెంట్ వెంట నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశ సజని పాల్గొన్నారు.

పెథాలజీ ల్యాబ్‌కు రూ.2.50 లక్షల పరికరం వితరణ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ క్లీనికల్ పెథాలజీ ల్యాబ్‌కు రూ. 2.50 లక్షల విలువ చే ఆటోమ్యాటిక్ హెమటాలజీ ఎనలైజర్‌వైద్య పరికరాన్ని పెథాలజీ విభాగాధిపతి డాక్టర్ అపర్ణకు అందించడం అభినందనీయమని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం జీజీహెచ్‌లోని ల్యాబ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన హెమటాలజీ ఎనలైజర్ వైద్య పరికరాన్ని డాక్టర్ కిరణ్‌కుమార్ ప్రారంభించారు. పేద రోగుల కోసం డాక్టర్ అపర్ణ తన మాతృమూర్తి లక్ష్మీ పేరున వైద్య పరికరం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ రమణ, డాక్టర్ గువెరా, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశ సజని పాల్గొన్నారు.

చలపతి ఫార్మసీలో లియో గ్లోబల్ ఓవర్సీస్ కార్యాలయం



గుంటూరు రూరల్: విద్యార్థుల ఉన్నతికి తమ కళాశాల ఎల్లప్పుడూ కృషిచేస్తుందని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదెండ్ల రామారావు పేర్కొన్నారు. శుక్రవారం నగర శివారులోని లాం నందున్న కళాశాలలో లియో గ్లోబల్ ఓవర్‌సీస్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈ కార్యాలయం వారంలో రెండు రోజులు విద్యార్థులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన పాస్‌పోర్ట్, అప్లికేషన్, స్లాట్ బుకింగ్, యూనివర్సిటీ షార్ట్‌లిస్ట్, కెరీర్ గైడెన్స్, స్కాలర్‌షిప్ గైడెన్స్, లోన్ సర్వీస్, పోస్ట్ ల్యాండ్ సర్వీస్, ఉచిత ఈఎల్‌పీ లాంగ్వేజ్ కోర్సులకు శిక్షణ అందించే కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. విద్యార్థులు ఈ సర్వీసులు ఉపయోగించుకుని, ఉన్నత చదువులు సాకారం చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు ఉన్నత చదువులకు యూఎస్, కెనడా, ఆస్ట్రేలియా, ఐర్లాండ్, యూరప్, జర్మని దేశాలకు వెళ్లేందుకు అవసరమయ్యే ప్రక్రియను ఉచితంగా ఈ కార్యాలయం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో లియో సంస్థ డైరెక్టర్ కె.ప్రసన్నలక్ష్మి, బ్రాంచ్‌మేనేజర్ ఎన్.అనూహ్య, మార్కెటింగ్ మేనేజర్ నాగూర్, యూకే టీం లీడర్స్ నాగమణి, వీణ, కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ వై.సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల వేళ అప్రమత్తంగా ఉండాలి

డీఎస్పీ పి.శ్రీనివాసరావు

నగరంపాలెం: త్వరలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని జిల్లా డీసీఆర్‌బీ డీఎస్పీ పి.శ్రీనివాసరావు అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలీస్ శాఖ అనుసరించాల్సిన నియమ, నిబంధనలపై జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని సమావేశ మందిరంలో దశల వారీగా సీఐలు, ఎస్ఐలకు నిర్వహిస్తున్న అవగాహన సదస్సు శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఏమాత్రం నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. ఇతరత్రా ప్రభుత్వ శాఖల సమన్వయంతో కలిసికట్టుగా విధులు నిర్వహించాలని అన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. వారిని చట్ట ప్రకారం కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని కోరారు. ఎన్నికల రోజున పోలింగ్ కేంద్రాలకు నిర్ణీత వేళల్లో హాజరై పటిష్టమైన బందోబస్తు నిర్వహించాలని అన్నారు. అదే విధంగా ఈవీఎం/ బ్యాలెట్ బాక్స్‌ల తరలింపులోనూ అప్రమత్తత అవసరమని చెప్పారు.

పూరిళ్లు దగ్ధం

కాకుమాను: మండల కేంద్రం కాకుమానులో గురువారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం సంభవించి, రెండు పూరిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. తహసీల్దారు జె.ప్రసాదరావు వివరాల మేరకు.. గ్రామానికి చెందిన అంచా వెంకట సుబ్బారావుకు చెందిన రెండు పూరిళ్లు ప్రమాదవశాత్తూ దగ్ధమయ్యాయి. బాపట్ల అగ్నిమాపక సిబ్బంది సకాలంలో ప్రమాద స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేయడంతో ఎలాంటి ప్రాణ, జంతు నష్టం వాటిల్లలేదని ఆయన తెలిపారు. ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు చెప్పారు. శుక్రవారం బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ.5వేలు, 25 కేజీల బియ్యం అందజేశారు. వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు. అగ్ని ప్రమాద విషయం తెలుసుకున్న కాకుమాను జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం బాధిత కుటుంబానికి కొంత నగదు అందజేశారు.

వైఎస్సార్ సీపీలో బీసీలకు పెద్దపీట



నెహ్రూనగర్: వైఎస్సార్ సీపీలో బీసీలకు పెద్ద పీట వేస్తున్నారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు గూడూరు నాని ముదిరాజ్ తెలిపారు. రాష్ట్రంలో 16 మంది బీసీలకు అసెంబ్లీ నియోజకవర్గాలకు సమన్వయకర్తలుగా వైఎస్సార్ సీపీ ప్రకటించడాన్ని స్వాగతిస్తూ మార్కెట్ సెంటర్‌లోని మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి క్షీరాభిషేకం చేయడంతో పాటు జై బీసీ.. ఒన్స్ మోర్ వైఎస్సార్ సీపీ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీలో బీసీలకు సముచిత స్థానం కల్పించారని ఇందుకు నిదర్శనంగా 16 మంది బీసీలను నియోజకవర్గ సమన్వయకర్తలుగా నియమించడం హర్షించదగ్గ విషయమన్నారు. బీసీలను మోసం చేసిన పార్టీ ఏదైన ఉందంటే అది టీడీపీ, జనసేన పార్టీలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి సీఎంని చేసుకునేందుకు బీసీలందరూ సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ప్రసాద్, దుర్గా, చంద్రశేఖర్, పల్లపు వెంకటేష్, క్రాంతి పాల్గొన్నారు.

రంగనాథస్వామికి చందనాలంకారం

చేబ్రోలు: చారిత్రక ప్రసిద్ధి చెందిన చేబ్రోలులోని రంగనాథస్వామి దేవస్థానంలో స్వామి వారు శుక్రవారం చందనాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ధనుర్మాసం సందర్భంగా అర్చకస్వాముల బృందం స్వామికి ప్రత్యేక పూజలు, విశేష కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. 20 కిలోల చందనంతో స్వామి వారిని ప్రత్యేక అలంకరించారు. గోదా దేవి అమ్మ వారు ప్రత్యేక అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ధనుర్మాస పూజలు, తిరుప్పావై, సహస్ర తులసి దళార్చన, చతుర్వేద పారాయణం, సామూహిక విష్ణు సహస్ర అర్చన, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చందన అలంకారంలో స్వామి వారిని దర్శించుకోవటం కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ప్రతి ఒక్కరికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు

ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: అర్హులైన ప్రతి ఒక్కరికి ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించి పేదరికాన్ని నిర్మూలించడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా తెలిపారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని ఆయన కార్యాలయంలో మెప్మా, జాతీయ పట్టణ జీవనోపాధి మిషన్ అధికారులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ ఆర్థికంగా ప్రతి ఒక్కరిని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు పథకాలకు ప్రవేశపెట్టారన్నారు. నిరుద్యోగాన్ని, పేదరికాన్ని నిర్మూలించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారని చెప్పారు. అర్హులైన వారికి ఉపాధి అవకాశాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు స్థానంలో ఉందని వివరించారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు కల్పించడంలో జగనన్న ప్రభుత్వం అన్ని రంగాల్లో ముందుందన్నారు. పలు రకాల పథకాల ద్వారా మహిళలకు మేలు చేస్తున్న ఘనత సీఎం వై.ఎస్.జగన్‌కే దక్కుతోందని చెప్పారు.

ఆర్‌యూబీ, ఆర్వోబీల నిర్మాణానికి సహకరించాలి


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నగర మేయర్ కావటి

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఆర్వోబీ, ఆర్‌యూబీల నిర్మాణాలకు సహకరించాలని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక, ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డికి నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు విన్నవించారు. గుంటూరు రైల్వేస్టేషన్‌కు విచ్చేసిన మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, బొకేతో సత్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో రోజురోజుకు ట్రాఫిక్ రద్దీ పెరుగుతోందని, తగిన విధంగా నగర పాలక సంస్థ రోడ్ల విస్తరణ చేపట్టిందని చెప్పారు. అలాగే ట్రాఫిక్ రద్దీ తగ్గాలి అంటే రైల్వేలైన్ల వద్ద ఆర్వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణం చేపట్టాలని వివరించారు. శంకర్ విలాస్ ఆర్వోబీ, శ్యామల నగర్ ఆర్‌యూబీ, నెహ్రూనగర్, సంజీవయ్య నగర్, గడ్డిపాడు రైల్వే లైన్ల వద్ద ఆర్వోబీ, ఆర్‌యూబీ నిర్మాణాలకు డీపీఆర్‌లను ఇప్పటికే నగర పాలక సంస్థ సిద్ధం చేసినట్లు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు మేయర్ తెలిపారు.

ఆర్టీసీలో డ్రైవింగ్ శిక్షణ పొందడం ఉత్తమం


శిక్షణ పరికరాలను పరిశీలిస్తున్న అధికారులు

పాత గుంటూరు: జిల్లా ప్రజా రవాణా సంస్థ(ఆర్టీసీ)లో డ్రైవింగ్ శిక్షణ పొందడం చాలా ఉత్తమమని రవాణా శాఖ అధికారి భరత్ పేర్కొన్నారు. శుక్రవారం గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లోని హెవీ మోటార్ డ్రైవింగ్ శిక్షణ స్కూల్‌ను రవాణా శాఖ అధికారులు భరత్, మోహన్, సౌజన్య తనిఖీ చేశారు. డ్రైవర్లకు శిక్షణ ఇచ్చే పరికరాలను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం శిక్షణ పొందుతున్న 13వ బ్యాచ్‌లోని డ్రైవర్లను ఉద్దేశించి భరత్ మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవరు క్రమ శిక్షణతో మెలగాలని తెలిపారు. ప్రమాద రహితంగా డ్రైవింగ్ చేయాలని, మంచి అలవాట్లతో, ప్రయాణికులను సురక్షితంగా తమ స్వస్థలాలకు చేర్చే విధంగా డ్రైవింగ్ చేయాలని అన్నారు. డ్రైవింగ్ నేర్చుకొనుటకు ఆసక్తిగల వారు ఆర్.టి.సి.శిక్షణ కళాశాలలోనే డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసుకోవాలని సూచించారు. గుంటూరు జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.రవికాంత్ మాట్లాడుతూ ప్రమాదాలకు ప్రధాన కారణమైన మత్తు పానీయములు తాగి డ్రైవింగ్ చేయుట, ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ డ్రైవింగ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో గుంటూరు టు డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలాం పాల్గొన్నారు.

రుసుం వసూలుకు త్వరలో గెజిట్


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ లక్ష్మీ శివ జ్యోతి

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మార్కెట్స్, షాప్స్, టాయిలెట్లు, సైకిల్ స్టాండ్లకు రుసుం వసూలు చేసుకునే విధి విధానాలకు సంబంధించి గెజిట్‌ను త్వరలో తయారు చేయడం జరుగుతుందని అదనపు కమిషనర్ కె.లక్ష్మీశివజ్యోతి తెలిపారు. నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు శుక్రవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో వివిధ మార్కెట్ వ్యాపారుల సంఘం ప్రతినిధులు, వ్యాపారులు, ఆర్వోలు, ఆర్ఐలతో నగరంలో ఇప్పటి వరకు ఉన్న గెజిట్‌పైన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముందుగా పాత గెజిట్ వివరాలు, నగరంలో ఉన్న మార్కెట్లు, సైకిల్ స్టాండ్లు టాయిలెట్స్ వివరాలను డెప్యూటీ కమిషనర్ వివరించారు. సదరు అంశాలపైన మార్కెట్ వ్యాపారుల సంఘం ప్రతినిధులు, వ్యాపారులు, ప్రజల అభిప్రాయాలు తీసుకున్న అనంతరం అదనపు కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వివిధ ప్రాంతాల్లో మార్కెట్స్, టాయిలెట్స్, సైకిల్ స్టాండులను పబ్లిక్ ఆక్షన్ ద్వారా కాంట్రాక్టర్లకు కేటాయించి రుసుం వసూలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రస్తుత సమావేశంలో వచ్చిన అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని స్టాండింగ్ కౌన్సిల్‌లో ఆమోదిస్తామని వివరించారు. ప్రస్తుతం నగరపాలక సంస్థకు బకాయి ఉన్నవారు వెంటనే చెల్లించాలని, లేకుంటే గత గెజిట్ ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, ఆర్వోలు బాలాజీ బాషా, రెహ్మాన్, సాంబశివరావు, రెవెన్యూ సెక్షన్ సూపరింటెండెంట్ వెంకటరామయ్య పాల్గొన్నారు.

గోమాతకు సీమంతం

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరువారితోటలోని గోశాలలో శుక్రవారం ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో 50వ గోపూజ, గోసేవ కార్యక్రమాలను నిర్వహించారు. గోమాతను శుభ్రం చేసి పసుపు, కుంకమలతో పూజలు నిర్వహించిన మహిళలు సీమంతం జరిపించి, పట్టువస్త్రాలు, సారె సమర్పించారు. మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ కొత్తూరి వెంకట్ మాట్లాడుతూ గోమాతను పూజించడం వలన గ్రహదోషాల నుంచి విముక్తి పొందుతారని తెలిపారు. అదే విధంగా సంక్రాంతి సంబరాల్లో భాగంగా భోగి మంటలు వేసి, గాలిపటాలను ఎగురవేశారు. కార్యక్రమంలో అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు, ప్రధాన కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, నేరెళ్ల సురేష్, అవోపా గుంటూరు శాఖ అధ్యక్షుడు కేవీ బ్రహ్మం, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, గోసేవ కన్వీనర్ చామర్తి రమేష్ పాల్గొన్నారు.